దశాబ్దాల నిరీక్షణ ఫలించనున్న తరుణం


సిద్ధం చేసిన లేఅవుట్

నాడు: కర్ణవానిపాలెం నిర్వాసితులు పునరావాసం కోసం దశాబ్దాల తరబడి ఎదురు చూస్తూనే ఉన్నారు. ఎందరో నాయకులు వస్తున్నారు.. వెళ్తున్నారు తప్ప వారి సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. తిరగని కార్యాలయం లేదు, విన్నవించని రాజకీయ నాయకుడు లేరు అన్నట్లుగా అయింది నిర్వాసితుల పరిస్థితి. ఏం చేయాలో దిక్కు తోచని స్థితి..

నేడు: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే నాగిరెడ్డి సమస్యను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యను వెంటనే పరిష్కరించాలన్న ఆదేశాలతో అధికారులు ఆగమేఘాల మీద లే అవుట్ సిద్ధం చేశారు. లాటరీ పద్ధతిలో స్థలాల కేటాయింపు చేపట్టారు. త్వరలోనే పట్టాలు అందజేయనున్నారు.

- కర్ణవానిపాలెం నిర్వాసితులకు పునరావాసం
- ఎమ్మెల్యే నాగిరెడ్డి కృషితో సమస్య పరిష్కారం
- లే అవుట్, పట్టాలు సిద్ధం
- లాటరీ పద్ధతిలో స్థలాల కేటాయింపు



అగనంపూడి: మూడు దశాబ్దాల నిరీక్షణ ఫలించనుంది. స్టీల్‌ప్లాంట్ నిర్వాసితుల్లో కర్ణవానిపాలెం వాసుల పునరావాస సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. ఎమ్మెల్యే నాగిరెడ్డి కృషితో కర్ణవానిపాలెం వాసుల్లో ఆశలు చిగురించాయి. గాజువాక మండలం, 79వ వార్డు కర్ణవానిపాలెం పునరావాసం సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో నిర్వాసితులు సంతోషంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నారు.

ఇదీ నేపథ్యం

విశాఖ స్టీల్‌ప్లాంట్ భూసేకరణ విభాగం మలిదశలో కర్ణవానిపాలెం, శనివాడ భూములను సేకరించింది. నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు కేటాయింపు విషయంలో ఏకాభిప్రాయం కుదరక ఇన్నాళ్లు సమస్య పరిష్కారం కుదరలేదు. 1996 నుంచి ఈ సమస్యను పరిష్కరిస్తామని ప్రతీ ఎన్నికల్లో అన్ని పార్టీలు హామీలు ఇవ్వడం, తర్వాత గాలికి వదిలేయడంతో సమస్య అలానే ఉంది.

గతంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్సార్ చొరవతో నిర్వాసితులందరికీ ములగాడ, పెదగంట్యాడల్లో స్థలాలు కేటాయించేందుకు ప్రతిపాదనలు చేశారు. వేరే ప్రాంతంలో పునరావాసం వద్దని, నిర్వాసితులు తిరస్కరించారు. ప్రస్తుతం నివాసముంటున్న చోటునే కేటాయింపులు చేయాలని కోరడంతో అప్పట్లో లేఅవుట్ చేసి స్థలాలు కేటాయించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. కొద్దిరోజులకే ఆయన అకాల మరణంతో సమస్య మళ్లీ మరుగున పడింది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే నాగిరెడ్డి ప్రత్యేక కృషి, శ్రద్ధ తీసుకొని ముఖ్యమంత్రి జగన్ వద్ద సమస్యను ప్రస్తావించడంతో నిర్వాసితుల సమస్యను సత్వర పరిష్కారం చేయాలని రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించి దీర్ఘకాలిక సమస్యకు చెక్ పెట్టారు.

అగనంపూడి సర్వే నంబర్ 95లోని స్థలంలో లేఅవుట్ చేసి 94 మంది కర్ణవానిపాలెం నిర్వాసితులు, 21 మంది శనివాడ నిర్వాసితులకు స్థలాలు సిద్ధం చేశారు. ప్లాట్లు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో లాటరీ వేసి కేటాయించారు. త్వరలోనే పట్టాలు అందజేయనున్నారు.

రుణపడి ఉంటాం



మూడు దశాబ్దాల పాటు పునరావాసం కోసం అలుపెరగని పోరాటం చేశాం. వినతులు సమర్పించాం. విజ్ఞప్తులు చేశాం. ప్రభుత్వ పెద్దలు మొదలు, జిల్లా కలెక్టర్, మంత్రులు, ఎమ్మెల్యేలకు మొరపెట్టుకున్నాం. అందరూ చేతులు ఎత్తేసినవారే. కాని ఎమ్మెల్యే నాగిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని సమస్యకు పరిష్కార మార్గం చూపించారు. ముఖ్యమంత్రి జగన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే నాగిరెడ్డికి మా గ్రామస్తులు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

–చిత్తా అప్పలరాజు (బుజ్జి), అగనంపూడి

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు



ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ ఇచ్చిన మాట నిలబెట్టుకుంది. మా తండ్రుల దగ్గర్నుంచి కాలనీవాసులందరికీ పునరావాసం కల్పించాలని వేడుకున్నాం. పదేళ్ల క్రితం మాకు ఆమోదయోగ్యం కాని ములగాడ, పెదగంట్యాడ ప్రాంతాల్లో స్థలాలు ఇస్తామన్నారు.మేం తిరస్కరించాం. ఈ విషయం మీద అన్ని పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులకు విన్నవించాం. గ్రామానికి పునరావాసం కల్పిస్తారనే ఆశతో మూడు దశాబ్దాల నుంచి పూరిళ్లలోనే జీవనం సాగిస్తున్నాం. ఇన్నాళ్లకు మా కల నెరవేరుతోంది.

– కరణం సత్తిరాజు, నిర్వాసితుడు

సంతోషంగా ఉంది



1996 నుంచి పునరావాసం కోసం ఎదురుచూస్తున్నాం. ఇప్పటికి సమస్య పరిష్కారం కుదిరినందుకు సంతోషంగా ఉంది. మా తల్లిదండ్రుల నుంచి సమస్యను ఎదుర్కొంటూ వచ్చాం. మాకు పెళ్లిళ్లై ఇద్దరు పిల్లలు కూడా పుట్టారు. సమస్య పరిష్కారం కాదేమో అని భయపడ్డాం. ఎన్నో ప్రభుత్వాలు మారాయి. మాకు మోక్షం దొరకదని డీలా పడిన సమయంలో ఈ ప్రభుత్వం హయాంలో పునరావాసం దక్కడంతో ఆనందంగా ఉంది.

– కరణం పైడిరాజు, కర్ణవానిపాలెం

ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధతో..



30 ఏళ్లుగా నలుగుతూ వచ్చిన కర్ణవానిపాలెం సమస్య ముఖ్యమంత్రి జగన్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి ప్రత్యేక చొరవ వల్ల కొలిక్కి వచ్చింది. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌ల దృష్టికి తీసుకువెళ్లడంతో, వారు సానుకూలంగా స్పందించడంతో తక్షణం లే అవుట్ చేసి ప్లాట్లు వేయించారు. త్వరలో స్థలాలు అప్పగించి పట్టాలు అందిస్తాం.

– తిప్పల నాగిరెడ్డి, ఎమ్మెల్యే

క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


శిబిరంలో షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు వెంకటేశ్వర కాలనీలోని సాయి చరణ్ ఆస్పత్రిలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఆదివారం జరిగిన శిబిరంలో 120 మందికి బీపీ, షుగర్, ఈసీజీ, ఎకో 2డీ పరీక్షలు ఉచితంగా నిర్వహించి, మందులు అందజేశారు. కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి, సాయి చరణ్ ఆస్పత్రి సంయుక్తంగా నిర్వహించిన ఈ శిబిరంలో ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ ధవళ వాసుబాబు, డాక్టర్ బి.శంకరావు స్వర్ణ కుమార్, జి.గంగా మహేష్, మళ్ల కుమార్, కిమ్స్ ఐకాన్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమల బాలాజీ దివ్యక్షేత్రానికి విరాళం

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలో కొలువైయున్న శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రానికి షీలానగర్‌కు చెందిన గాలి అప్పారావు, రేవతి దంపతులు రూ.10వేలు విరాళంగా ఇచ్చారు. విరాళాన్ని నగదు రూపంలో ట్రస్ట్ ప్రతినిధులకు అందజేశారు. ట్రస్ట్‌లో భక్తులకు ఏర్పాటు చేసే అల్పాహారం నిమిత్తం దీనిని వినియోగించాలని కోరారు.

గౌరీ పరమేశ్వరుల సన్నిధిలో అన్న సమారాధన


అన్నసమారాధన ప్రారంభిస్తున్న గౌరీ సేవాసంఘం ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: గౌరీ సేవా సంఘం నాతయ్యపాలెం, అక్కిరెడ్డిపాలెం ఆధ్వర్యంలో శ్రీ గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా 69వ వార్డు నాతయ్యపాలెం సీఎస్ఆర్ కల్యాణ మండపంలో ఆదివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. సేవా సంఘం అధ్యక్షుడు దాడి వెంకటరమేష్ అన్నసమారాధనను ప్రారంభించారు. 5 వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో సేవా సంఘం సభ్యులు, మహిళా కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత


పిరమిడ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

గాజువాక: క్రమం తప్పకుండా ధ్యానం చేయడంవల్ల ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ అధ్యక్షుడు రెడ్డి నాయుడు అన్నారు. స్థానిక శ్రీనివాసనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన విశ్వశక్తి ప్రకృతి పిరమిడ్ ధ్యాన కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పిరమిడ్ కేంద్రం నిర్వాహకులు మాస్టర్ సత్యారావు, ఉషారాణి, ట్వింకిల్ స్కూల్ కరస్పాండెంట్ డి.శ్యామ్, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ విజయోత్సవం

గాజువాక: నాలుగు రాష్ట్రాలకు జరిగిన ఎన్నికల్లో బీజేపీ మూడు రాష్ట్రాల్లో విజయం సాధించిన సందర్భంగా ఆ పార్టీ గాజువాక నాయకులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో పాతగాజువాక జంక్షన్‌లో తొలుత కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు సోంబాబు, బొండా ఎల్లాజీ, రోహిణి, బాటా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల నమోదుకు 3650 దరఖాస్తులు

ముగిసిన రెండు రోజుల స్పెషల్ డ్రైవ్


దరఖాస్తులను పరిశీలిస్తున్న ఈఆర్వో లక్ష్మారెడ్డి

గాజువాక: గాజువాక నియోజకవర్గంలో కొత్తగా ఓటు నమోదు చేసుకోవడానికి 3650 మంది దరఖాస్తు చేసుకున్నారని ఓటర్ల నమోదు అధికారి (ఈఆర్వో) డి.లక్ష్మారెడ్డి తెలిపారు. మార్పులు, చేర్పుల కోసం మరో 3700 మంది నుంచి దరఖాస్తులు అందినట్లు చెప్పారు. ఓటర్ల జాబితాల్లో అభ్యంతరాల స్వీకరణ, చేర్పులు, మార్పులు, కొత్త ఓటర్ల నమోదు కోసం నియోజకవర్గంలోని 302 పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్వోలు ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రెండు రోజులపాటు దరఖాస్తులను స్వీకరించారు. కొత్తగా ఓటర్ల నమోదుకు (ఫారం–6) 3650 మందితో పాటు జాబితాల నుంచి తొలగింపులు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోవడం వంటి కారణాల (ఫారం–7)కు సంబంధించి 840 మంది, నివాసాల మార్పు, పొరపాట్లను సరిచేయడం, సవరణలు (ఫారం–8) కోసం 2860 మంది నుంచి దరఖాస్తులను స్వీకరించారు. వివిధ పోలింగ్ కేంద్రాల్లో శిబిరాల నిర్వహణను జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, తహసీల్దార్లు శ్రీవల్లి, రమాదేవి, జీవీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రసాద్ బాబు తదితరులు పర్యవేక్షించారు.

బుద్ధ విహార్‌కు చేరిన తథాగతుని విగ్రహం


బుద్ధ విహార్‌కు చేరుకున్న బుద్ధ విగ్రహం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బౌద్ధ మిషన్ ఆధ్వర్యంలో బుద్ధ విగ్రహానికి ఘన స్వాగతం పలికారు. స్టీల్‌ప్లాంట్‌లో నిర్మిస్తున్న బుద్ధ విహార్‌లో ప్రతిష్ఠించనున్న బుద్ధుడి విగ్రహాన్ని మహారాష్ట్రకు చెందిన గగన్ మాలిక్ అందజేసిన విషయం తెలిసిందే. ఎనిమిది లోహాలతో 290 కేజీల బరువు కలిగిన విగ్రహం ఆదివారం కూర్మన్నపాలెం చేరుకుంది. అక్కడ వారికి బౌద్ధ మిషన్ అధ్యక్షుడు డాక్టర్ సంజయ్ కపార్థే, మిషన్ ప్రతినిధులు అందుకున్నారు. అక్కడి నుంచి విగ్రహాన్ని ర్యాలీగా స్టీల్‌ప్లాంట్‌లోని బౌద్ధ విహార్‌కు తరలించారు. విహార్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో బౌద్ధ మిషన్ కార్యవర్గ సభ్యులు లక్ష్మణ్ మూర్తి, పలు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదలకు చీరల పంపిణీ


పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: ఉక్కు నిర్వాసితుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పులి భూలోకరెడ్డి వర్ధంతి సందర్భంగా పేదల మహిళలకు ఆదివారం చీరలు పంపిణీ చేశారు. 75వ వార్డు నెల్లిముక్కులో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, తిప్పల గురుమూర్తిరెడ్డి హాజరై, భూలోకరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. రెయిన్ బో చిల్డ్రన్స్ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు జె.యశ్వంత్, పులి బాలా శ్రీలతారెడ్డి, దివ్య, కార్తీక్ సేవలందించారు. పీబీఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత పులి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ పులి లక్ష్మీభాయి, గొందేశి సత్యారావు, మంత్రి శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ విజేతలకు అభినందన


విజేతలను అభినందిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీజీఎం, కబడ్డీ సంఘం నాయకులు

ఉక్కునగరం: రాష్ట్ర స్థాయి మహిళల కబడ్డీ పోటీల్లో సత్తా చాటి విశాఖ జిల్లా జట్టు మూడో స్థానం కైవసం చేసుకోవడంతో విజేతలను పలువురు ప్రశంసించారు. నవంబర్ 29 నుంచి డిసెంబర్ 1 వరకు కర్నూల్‌లో జరిగిన 70వ రాష్ట్ర స్థాయి మహిళల కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు తృతీయ స్థానం కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా ఆదివారం స్పోర్ట్స్ విభాగం స్టేడియంలో జరిగిన అభినందన కార్యక్రమంలో కోచ్ కారి లక్ష్మణరావు, క్రీడాకారులను స్పోర్ట్స్ విభాగం ఇన్‌చార్జ్ సీజీఎం కె.హెచ్. ప్రకాశ్, కబడ్డీ జిల్లా సంఘం అధ్యక్షులు కృష్ణ, కార్యదర్శి జె.ఎస్.వి.ప్రసాదరెడ్డి అభినందించారు.

పూర్వ విద్యార్థుల సేవానిరతి


రక్తదాన శిబిరంలో పాల్గొన్న సత్యనారాయణ

అగనంపూడి: పూర్వ విద్యార్థుల సేవానిరతి స్ఫూర్తిదాయకమని విశాఖ స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కె.సత్యనారాయణ రావు అన్నారు. అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2005 బ్యాచ్ విద్యార్థులు స్థానిక సీడబ్ల్యూసీలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్తం అపర సంజీవని అని పేర్కొన్నారు. విశాఖ బ్లడ్ బ్యాంక్ నిర్వహించిన కార్యక్రమంలో 80 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ కార్యదర్శి కరణం పైడిరాజు, బలిరెడ్డి సత్యనారాయణ, వాక ర్స్‌క్లబ్ అధ్యక్షుడు మడగల నరసింగరావు, కార్మిక సంఘాల నాయకులు సాయిన సన్యాసిరావు, యువ రచయిత కంచిపాటి నరసింహమూర్తి, వై.శివ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు, అనాథలకు దుప్పట్ల పంపిణీ


వృద్ధులకు దుప్పట్లు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

పెదగంట్యాడ: నడుపూరు హైస్కూల్ 1998–99 టెన్త్ క్లాస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వృద్ధులు, పేదలకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. గొలగాని శ్రీనివాసరావు, నంబాల వెంకటరావు, నమ్మి అప్పలనాయుడు, అండిబోయిన అప్పలరాజు ఆర్థిక సాయంతో రోడ్డు పక్కన ఉండే అనాథలు, వృద్ధులకు వీటిని అందజేశారు. మధ్యాహ్నం భోజనం సమకూర్చారు. సిరిశెట్టి వెంకట శివ అప్పారావు, పిట్టా పైడిరాజు, వాసు, తాతారావు, శ్రీను, వెంకటరమణ, నానాజీ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మల్లమ్మ పేరంటాళ్ల పండగ


మల్లమ్మ పేరంటాలు అమ్మవారు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు మింది గ్రామస్తుల ఆరాధ్య దైవం శ్రీ మల్లమ్మ పేరంటాళ్లమ్మ వారి పండగ మహోత్సవాన్ని ఆదివారం అక్కిరెడ్డిపాలెంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ పొలిమేరలో కొలువుదీరిన అమ్మవారికి ఏటా డిసెంబర్ మొదటి వారంలో పండగ చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా మింది గ్రామస్తులు అక్కిరెడ్డిపాలెం చేరుకుని అమ్మవారికి పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలను సమర్పించారు. కార్పొరేటర్ గుడివాడ అనూష, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్, వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్ గుడివాడ అప్పలరామ్మూర్తి, ఆలయ కమిటీ ప్రతినిధులు, గుడివాడ అప్పన్న మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు


సారె ఊరేగిస్తున్న మహిళలు

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు దయాల్ నగర్‌లో గౌరీ పరమేశ్వరుల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సారె ఊరేగించారు. కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి గౌరీ పరమేశ్వరులను దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు తయారు చేసిన పిండి వంటలను గౌరీ పరమేశ్వరులకు నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో బుద్ధా శివాజీ, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

9న టెన్త్ విద్యార్థులకు అవగాహన సదస్సు

గాజువాక: గాజువాక ప్రాంతంలోని ప్రైవేట్ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈనెల 9న పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు గాజువాక పారిశ్రామిక ప్రాంత ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ (జిప్సా) అధ్యక్షుడు పి.భాస్కరరావు తెలిపారు. ఆదివారం నిర్వహించిన జిప్సా ప్రతినిధుల సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేసినట్టు తెలిపారు. కార్యక్రమాన్ని టీఎన్నార్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నామన్నారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు బి.శ్రీనివాస్, డి.శ్రీనివాసరావు, ఎం.జగ్గారావు, మురళి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు


పాతగాజువాక జంక్షన్‌లో విజయోత్సవం జరుపుకొంటున్న కాంగ్రెస్ నాయకులు

గాజువాక: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మెజారిటీ సాధించడంతో ఆ పార్టీ గాజువాక నాయకులు ఆదివారం సంబరాలు జరుపుకొన్నారు. ఆ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి గవర వెంకట రమణారావు ఆధ్వర్యంలో పాతగాజువాక జంక్షన్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద బాణసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం భవిష్యత్ విజయాలకు సంకేతమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు జెర్రిపోతుల ముత్యాలు, ఉరుకూటి బాబూరావు, గుడివాడ శ్రీనివాసరావు, లక్కరాజు రామారావు, కొవిరి దేవుడు, ఎం.స్వర్ణ, ఉరుకూటి అచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ పైప్‌లైన్ పనులకు భూమిపూజ


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: జీవీఎంసీ 67వ వార్డులోని గాజువాక హైస్కూల్ రోడ్‌లో వాటర్ పైప్‌లైన్ పనులకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆదివారం భూమిపూజ చేశారు. రూ.20 లక్షలతో చేపట్టనున్న ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం పైప్‌లైన్ పాడవడంతో నీటి లీకేజీ అధికమై, ప్రజలు నీటి కోసం ఇబ్బంది పడుతున్నట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. కొత్త పైప్‌లైన్ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, స్థానిక నాయకులు అచ్చెం నాయుడు, సూర్యనారాయణ, చిత్రాడ అప్పారావు, వెంకటేష్, కామునాయుడు, భాస్కరరావు, అన్నపూర్ణ, సూర్యనాగేశ్వరరావు, తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే 'ఉక్కు' పరిరక్షణ



దీక్ష శిబిరం వద్ద నినాదాలు చేస్తున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఎందరికో ఉపాధినిస్తున్న విశాఖ ఉక్కు పరిశ్రమను కార్మికులందరూ పోరాటాలతో కాపాడుకుంటారని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1025వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులతో పాటు స్టీల్‌ప్లాంట్ హెచ్ఎంఎస్ యూనియన్ కార్మికులు పాల్గొని, కేంద్రప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా 'వాసీవా' స్వర్ణోత్సవం


కార్యక్రమంలో పాల్గొన్న ఆటోనగర్ పారిశ్రామిక వేత్తలు, పలు విభాగాల ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్‌లోని విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్‌ను ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీసీ రోడ్డులోని కాకతీయ ఐటీఐ వ్యాలీలో నిర్వహించిన వనసమారాధనలో వాసీవా ప్రతినిధులు, సీనియర్ పారిశ్రామిక వేత్తల సమక్షంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ పారిశ్రామిక వేత్తలను సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డీజెడ్ఎం జయబాబు, ఎంఎస్ఎంఈ ఏడీ చంద్రమౌళి, ఎస్ఎస్ఐసీ అధికారులు కమలేశ్వరి, అశ్విన్, ఐలా కమిషనర్ జయచంద్ర, వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, కార్యదర్శి రాంప్రసాద్, కోశాధికారి పర్చూరి ప్రభాకర్, ఐలా చైర్మన్ కె.సత్యనారాయణ రెడ్డి (రఘు), వైస్ చైర్మన్ కొల్లి ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చీకటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ ఆర్మీ క్విజ్ పోటీల్లో ప్రతిభ


బహుమతులు అందుకుంటున్న డీపాల్ విద్యార్థులు

ఉక్కునగరం: ఇండియన్ ఆర్మీ క్విజ్ పోటీల్లో స్టీల్‌ప్లాంట్ డీపాల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కార్గిల్ విజయం సాధించి 25 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఆదివారం న్యూఢిల్లీలో ఆల్ ఇండియా ఆర్మీ క్విజ్ పోటీలు నిర్వహించారు. సికింద్రాబాద్‌లో జరిగిన టైర్–1 పోటీల్లో 216 పాఠశాలల జట్లు పాల్గొన్నాయి. ఇందులో విజేతలుగా నిలిచిన డీపాల్ విద్యార్థులు చెన్నైలో జరిగిన సెమీ ఫైనల్స్‌లో పాల్గొన్నారు. ఆ పోటీల్లో 72 పాఠశాలల జట్లు పాల్గొని ఫైనల్స్‌కు చేరు కున్నాయి. ఫైనల్స్‌లో 12 జట్లు పాల్గొనగా డీపాల్ జట్టు ఐదోస్థానం సొంతం చేసుకుంది. జట్టు విద్యార్థులు రౌనక్ సిద్ధిఖ్, ఆల్బన్ జోసెఫ్, చైతన్య నరేష్, నిరంజనలకు రూ.2,90,000 చెక్కు, శాంసంగ్ ట్యాబ్, మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ సహాయమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీపాల్ ప్రిన్సిపాల్ ఫాదర్ జాన్సన్‌జాకబ్, మెంటార్ శివప్రసాద్ పాల్గొన్నారు.